పొంచి ఉన్న సీజనల్ ముప్పు

నగరంలో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం

- శుభ్రం చేయని డ్రెయినేజీలు
- ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న పిచ్చి మొక్కలు, చేరుతున్న మురుగు



ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు



శ్రీనివాసనగర్‌లో కచ్చా కాల్వల నుండి ఖాళీ స్థలాల్లోకి చేరిన మురుగు నీరు



డ్రెయినేజీలో మురుగు నీరు



అపరిశుభ్రంగా కచ్చా కాల్వ

ఖమ్మంమయూరిసెంటర్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయి. నగరంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు అధికారులు నిర్ణయాలు తీసుకుంటున్నా.. క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. డ్రెయినేజీలను శుభ్రం చేయడం, రోడ్లను ఊడ్చడం, ఖాళీ స్థలాల్లోకి మురుగు చేరకుండా చూడడం కీలకం. అయితే నగరంలోని శ్రీనివాసనగర్‌తో పాటు పలు కాలనీల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందని, అధికారులు పట్టించుకుంటేనే స్థానిక సమస్యలు పరిష్కారమవుతాయని అంటున్నారు.

కచ్చా కాల్వలే డ్రెయినేజీగా..

శ్రీనివాసనగర్‌లో ప్రధాన రహదారి వెంట సీసీ డ్రెయినేజీ లేదు. ఈ ప్రాంతంలో మురుగు నీరంతా కచ్చా కాల్వ ద్వారానే ప్రవహిస్తుంది. ఈ కచ్చా కాల్వలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పడడంతో మురుగు బయటకు పోలేని స్థితి ఉంది. ఇక కొన్ని వీధుల్లో డ్రెయినేజీలున్నా అవి చిన్నగా ఉండడం, వాటిని సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. కచ్చా కాల్వల్లో బురద తొలగించకపోవడంతో మురుగు బయటకు పోయే పరిస్థితి లేక పక్కనే ఉన్న ఖాళీ స్థలాల్లోకి చేరుతుంది. దీంతో ఆ స్థలాలు అపరిశుభ్రంగా మారడంతో పాటు అక్కడ పందులు దొర్లుతున్నాయి.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు..

ఈ ప్రాంతంలో ఖాళీ స్థలాల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఈ ఖాళీ స్థలాల నిర్వహణను యజమానులు పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు మొలచి అడవుల్లా కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో వర్షాలు ఎక్కువగా కురిస్తే ఈ స్థలాల్లో పెద్దఎత్తున మొక్కలు మొలకెత్తడంతో పాటు అపరిశుభ్రంగా మారుతాయని స్థానికులు వాపోతున్నారు. ఈ స్థలాలను ముందుగానే శుభ్రం చేయించి, వర్షపు నీరు నిల్వకుండా చూడాలని కోరుతున్నారు.

డ్రెయినేజీలు నిర్మించాలి



నివాసాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించాలి. డ్రెయినేజీలు లేక మురుగు నీరు ఖాళీ స్థలాల్లోకి చేరుతుంది. అధికారులు ఈ ప్రాంత అభివృద్ధికి చర్యలు చేపట్టాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి.

– యర్రా రంజిత్, శ్రీనివాసనగర్

రైతులకు అవగాహన కోసం 'రైతునేస్తం'



అల్లీపురం రైతువేదికలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: సాగులో ఆధునిక విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడించేందుకే ప్రభుత్వం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. హైదరాబాద్ నుంచి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి వీసీ ద్వారా రైతులతో మాట్లాడగా రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం రైతువేదికలో డీసీసీబీ చైర్మన్, అల్లీపురం రైతువేదికలో మేయర్ పాల్గొన్నారు. అలాగే, రైతు శిక్షణ కేంద్రం జేడీ అభిమన్యుడు, ఏడీఏ కె.వెంకటేశ్వరరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్లు తాతా రఘురాం, రావూరి సైదబాబు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్ కుమార్, కార్పొరేటర్ రావూరి కరుణ, ఏఓ కర్నాటి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓలు ప్రతిభ, వేదవ్యాస్, శివకృష్ణ, శిరణ్మయి, వెంకటేష్, వేదితతో పాటు నాయకులు వాంకుడోత్ దీపక్, సంక్రాంతి నాగేశ్వరరావు, బండి వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం, బీరోలు, దమ్మాయిగూడెం రైతువేదికల్లో రైతునేస్తం కార్యక్రమంలో రైతులతో పాటు అధికారులు హాజరై సీఎం రేవంతర్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. ఏఓ సీతారాంరెడ్డి, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, తహసీల్దార్ విల్సన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్, గోళ్లపాడు రైతువేదికల్లో తులతో పాటు అధికారులు హాజరై సీఎం రేవంతర్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. ఏఓ ఉమానగేష్, తహసీల్దార్ పి.రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్ , ఏదులాపురం సహకార సంఘం చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్, రామారావు రైతులు మల్లారెడ్డి, వీరారెడ్డి, ఉన్నారు.



తిరుమలాయపాలెంలో..



ఖమ్మంరూరల్: కాన్ఫరెన్స్‌లో అధికారులు, రైతులు

యాదవులకు మంత్రి పదవి కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర కేబినెట్‌లో యాదవులకు స్థానం కల్పించాలని తెలంగాణ యాదవ మహాసభ నాయకులు కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సోమవారం ఖమ్మంలో వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించడమే కాక బీసీల్లో రెండో అతిపెద్ద కులంగా ఉన్న యాదవులకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అంతేకాక స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, యాదవుల జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని, రఘునాథపాలెంలో గొర్రెల మార్కెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. యాదవ మహాసభ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడి లింగయ్య యాదవ్, గుమ్మా రోశయ్య యాదవ్‌తో పాటు నాయకులు కోడి లింగయ్య, భారీ మల్సూర్, చిత్తారు ఇందుమతి, దొడ్డ నాగేశ్, భారీ సురేష్, ఆవుల రామకృష్ణ, చుంచు వెంకట్, ధనియాకుల వీరస్వామి, పొదిల భాస్కర్, భారీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిరుమలాయపాలెం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కామేపల్లి: మండల పరిధిలోని ముచ్చర్ల–జాస్తిపల్లి హైస్కూల్ 1991–92 బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్థానిక లక్ష్మిగార్డెన్స్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళన వేడుకను ఘనంగా జరుపుకున్నారు. 33 సంవత్సరాల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని అప్పటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అప్పటి గురువులు జానకిరామయ్య, సాధు లక్ష్మణరావులను, భగవద్గీతలోని 720 శ్లోకాలను కంఠస్తం చేసిన స్నేహితురాలు మద్దినేని ఉషారాణిని ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం మిషన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2011–12 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు.



కామేపల్లిలో..

దాతల సాయం అభినందనీయం



బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రఘునాథపాలెం: దాతలు పేద విద్యార్థులకు సాయం అందించడం అభినందనీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని శివాయగూడెం ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు ఖమ్మం 11వ డివిజన్ కార్పొరేటర్ సరిపూడి రమా సతీష్ రూ.20,500 విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ చెరుకూరు ప్రదీప్ రూ.20,000 ఆర్థిక సాయాన్ని పాఠశాల అభివృద్ధి కోసం అందజేశారు.కాంగ్రెస్ నాయకుడు బానోతు బాలాజీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కట్టా శ్రీనివాసరావు, నాయకులు తుమ్మల యుగంధర్, ఆత్మచైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి

కూసుమంచి: గిరిజన తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం లాల్‌సింగ్ తండాలోని పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పలు అవసరాలను గుర్తించామని, వాటిని తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాంచంద్రు, సిద్ధు, సైదులు తదితరులు ఉన్నారు.

ప్రతీ పంచాయతీపై బీజేపీ జెండా ఎగరాలి



పీఎం విశ్వకర్మ యూనిట్లను పంపిణీ చేస్తున్న సుధాకర్

నేలకొండపల్లి: గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రతీ జీపీని గెలుచుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. మండలంలోని కొంగర, రాయగూడెం గ్రామాల్లో సోమవారం ఆయన పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు యూనిట్లు పంపిణీ చేశారు. అలాగే, పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పాక సుధాకర్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేయనున్నందున అత్యధిక స్థానాలు గెలిచేలా కార్యకర్తలు శ్రమించాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి మల్లేబోయిన గోవిందరావు, నాయకులు కొండా హర్ష, శేషగిరి, కాళంగి వెంకటేశ్వర్లు, సూరేపల్లి వెంకటేశ్వర్లు, రామారావు, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా ఫిర్యాదుల పరిష్కారం

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించడంలో అధికారులు బాధ్యతగా పని చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కేఎంసీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి వాటి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. వారంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన నగర ప్రజలతో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అహ్మద్‌షఫీ ఉల్లా, ఈఈ కృష్ణాలాల్, ఏవో శ్రీనివాసరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య పాల్గొన్నారు.

గ్యాంగ్‌వర్క్‌తో పారిశుద్ధ్య పనులు..

రోజువారీగా పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులతో పాటు అదనపు కార్మికులను నియమించుకుని గ్యాంగ్‌వర్క్‌తో ఈ పనులను చేయిస్తున్నారు. 8, 41, 47, 53 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 20 మంది చొప్పున అదనపు కార్మికులను ఏర్పాటు చేసి పారిశుద్ధ్య పనులు కొనసాగించారు. ఖాళీ స్థలాలను, డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్నారు.

కాంట్రాక్టర్‌కు జరిమానా..

29వ డివిజన్ ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద బీటీ రోడ్డుపై భారీ వాహనాలను తిప్పిన కాంట్రాక్టర్‌కు రూ.5 వేల జరిమానా విధించారు. స్థానిక ప్రజల ఫిర్యాదుతో కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ రోడ్డును పరిశీలించి సదరు కాంట్రాక్టర్‌కు జరిమానా విధించి రశీదు అందజేశారు.

పేదలకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కనకయ్య



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

కామేపల్లి: పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు మేలు జరుగుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండలంలోని జోగ్గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలు నిర్వహిస్తుందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: ట్రాఫిక్ నియమాలపై రిక్కాబజార్ స్కూల్ విద్యార్థులకు సోమవారం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను చిన్నవయస్సులోనే నేర్పించడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యతలను గుర్తు చేస్తాయన్నారు. హెల్మెట్లు, సీట్ బెల్ట్‌లు వంటి భద్రతా సామగ్రి డ్రైవర్లకు రక్షణ కవచాలుగా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఆర్‌ఐ సాంబశివరావు, ఎస్సైలు రవి, రాము, సాగర్ తదితరులు ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం డివిజన్ కమిటీల ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరు కాపు సంఘం డివిజన్ కమిటీలను సోమవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు ఖమ్మంలోని సంఘం నాయకుడు గుండాల కృష్ణ నివాసంలో సమావేశమైన పలువురు 13 డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శులను ప్రకటించారు. ఖమ్మం 17వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పగడాల మోహన్‌రావు, సుంకర పుల్లారావు, 27వ డివిజన్‌కు మూగల శ్రీనివాస్, ముత్యం రామకృష్ణ, 26వ డివిజన్‌కు దేవరపల్లి ప్రసాద్, సముద్రాల శ్రీను, 29వ డివిజన్‌కు మొగిలిసెట్టి అశోక్, దేవరపల్లి సాయిప్రసాద్, 30వ డివిజన్‌కు నూనె నందు, అరవపల్లి వేణుగోపాల్, 31వ డివిజన్‌కు యర్రా మల్లికార్జున్, ఆవుల శ్రీను, 32వ డివిజన్‌కు కుమ్మరికుంట్ల సత్యనారాయణ, రాగవరపు ప్రసాద్, 33వ డివిజన్‌కు మార్తా నరసింహారావు, అల్లం వీరభద్రం, 34వ డివిజన్‌కు కోయల వీరభద్రం, తోట రంగారావు, 35వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా మలిసెట్టి నగేష్, సెక్రటరీ వెన్నా పండును ఎన్నుకున్నారు. అలాగే, 36వ డివిజన్‌కు వెనిగెల్ల భాస్కర్, బండి వెంకటేశ్వర్లు, వేముల సత్యనారాయణ, బబ్బూరి చైతన్య, 47వ డివిజన్‌కు మాటేటి రామారావు, నాలం గోపి, 48వ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా షాబాను వెంకటరమణ, ఆకుల సత్యనారాయణను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు కొత్త సీతారాములు, మెంతుల శ్రీశైలం, తాలూరు హన్మంతరావు, కనకం జనార్దన్, గీత వెంకన్న, తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావు, కనకం భద్రయ్య, సముద్రాల శ్రీను, జంగిలి రమణ, ఎస్.వీ.రమణ, కుమ్మరికుంట్ల వెంకటరమణ, మూలగుండ్ల శ్రీహరి, గుండాల అప్పారావు, కిషన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంగన్‌వాడీలతో పోషణ, మేథస్సు..

తిరుమలాయపాలెం: అంగన్‌వాడీల్లో పోషణతో పాటు, ప్రీ స్కూల్ బుక్స్ ద్వారా పిల్లల మేథస్సును పెంచే విధంగా ఆటపాటలు, కథలతో ఒత్తిడి లేని విద్య అందిస్తున్నట్లు సీడీపీఓ ఎం.కవిత అన్నారు. మండలంలోని తెట్టెలపాడు గ్రామంలో అంగన్‌వాడీ 3వ సెంటర్‌లో అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సావిత్రి, యూపీఎస్ హెచ్‌ఎం కె.లాలయ్య, ఉపాధ్యాయులు ఉపేందర్ రావు, ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

రామారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

ఖమ్మంఅర్బన్/ఖమ్మం మామిళ్లగూడెం: కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన టీయూసీఐ నాయకుడు ఆడెపు రామారావు మృతి కార్మికులకే అన్ని వర్గాల ప్రజలకు లోటని టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య పేర్కొన్నారు. ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియాలో సోమవారం రామారావు మూడో వర్ధంతి నిర్వహించగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక రామయ్య మాట్లాడారు. ఈ నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కొయ్యల శ్రీనివాస్, కంకణాల శ్రీను, బొమ్మకంటి రమేష్, శ్రీను చంద్రం, హరీష్, వెంకన్న, రెడ్డి, సిల్వరాజు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఖమ్మం మామిళ్లగూడెం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కె.జానిమియా అన్నారు. ఈ మేరకు సోమవారం నగరంలోని 19వ డివిజన్‌లో వన్‌టౌన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలోని వన్ టౌన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వన్‌టౌన్ ప్రాంతంలో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిష్కారించని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర సహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, ఏరియా కార్యదర్శి వరదా నర్సింహారావు, మాలకొండయ్య, సామేలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'రచ్చబండ'

ఖమ్మం అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ పిలుపు మేరకు రచ్చబండ కార్యక్రమాన్ని నగరంలోని 7వ డివిజన్ సెంటర్లో నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు వాగాదాని రామకృష్ణ, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ ఆకుల నాగేశ్వరరావు గౌడ్, కార్పొరేటర్లు దొంగల సత్యనారాయణ, రేఖ సత్యనారాయణ, దొంగల నాగరాజు, అంజన్న, ఉపేందర్, పల్లపు వెంకన్న, రవీంద్రాచారి, రాము, హుస్సేన్, వేణు, రాము, మల్లయ్య ఉన్నారు.

రఘునాథపాలెం: మండలంలో చేరుకొమ్ము తండాలో బీజేపీ ఆధ్వర్యంలో విజయ సంకల్పసభను ఏర్పాటు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గుత్తా వంశీ, మండల ప్రధాన కార్యదర్శులు భూక్యా బాలాజీ, ఈర్లల రాంబాబు, మండల ఉపాధ్యక్షులు భూక్యా హరీష్, పసుపులేటి నరసింహారావు, పొట్లపల్లి నాగేశ్వరరావు, కోటేరి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కామేపల్లి: మండలంలోని పింజరమడుగులో ఇటీవల జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు కామేపల్లి పోలీసులు తెలిపారు. ఘర్షణపై ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందగా, ఓ వర్గంపై దాడి కేసు, మరోవర్గంపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై..

రఘునాథపాలెం: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైనట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిమ్మపుడికి చెందిన సీహెచ్ పాపారావు ఈ నెల 6వ ఘర్షన పడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకి తెలయకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

కేటీఆర్‌కు సంఘీభావంగా జిల్లా నాయకులు



తెలంగాణ భవన్‌లో పువ్వాడతో నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: ఈ ఫార్ములా కేసులో విచారణకు కేటీఆర్‌ను ఏసీబీ పిలిపించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయనకు సంఘీభావంగా ఖమ్మం నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నేతృత్వంలో ఖమ్మం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు చేరుకొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ పక్షపాత దురుద్దేశంతోనే కేటీఆర్‌పై కక్ష సాధిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు.

డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్‌గా బి.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేయగా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన నియామకం పట్ల పలువురు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కళాశాల, ఆస్పత్రి సిబ్బంది అభినందించారు.

స్వేరోస్ పాలేరు అధ్యక్షుడిగా రామచంద్రు



తిరుమలాయపాలెం: స్వేరోస్ పాలేరు నియోజకవర్గం అధ్యక్షుడిగా కొండ్రు రామచంద్రు ఎంపికయ్యారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఈదయ్య, రమణ, వెంకన్నల ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా జె.ఉమ, జనరల్ సెక్రటరీగా నాగేందర్ కోశాధికారిగా సాల్మన్‌రాజు, అధికార ప్రతినిధిగా మాగి వెంకన్నతో పాటు నరసింహా, నర్సయ్య, బాలరాజు, సుధాకర్, కాంతారావు, రామాంజనేయులును ఎన్నుకున్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా శాఖమూరి



రఘునాథపాలెం: సీపీఐ మండల కార్యదర్శిగా శాఖమూరి శ్రీనివాసరావు మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో సోమవారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా జూల వెంకటేశ్వర్లు, లచ్చిరాంతోపాటు 21 మంది సభ్యులతో కూడిన మండల కౌన్సిల్‌ను ప్రకటించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	భైరవం
సాయిరాం	తొలిప్రేమ
ఆదిత్య	డ్రాగన్
శ్రీనివాస	థగ్‌లైఫ్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	50	చుక్కకూర	3
బీర	40		20
దొండ	18	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	86	గోంగూర	4
గోరుచిక్కుడు	30		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	40		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	36		40
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	70		20
బీట్‌రూట్	40	-ఖమ్మం వ్యవసాయం	